
# నమస్తే తెలంగాణ

## హనుమకొండ

5 | శనివారం 29 జూన్ 2024 | HANUMAKONDA

భీమదేవరపల్లి: వంగరలో పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పీవీ ఆశయాలను కొనసాగించాలి

- రవాణా, బీసీ, సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- పీవీ స్వగ్రామం వంగరలో జయంతి వేడుకలు

భీమదేవరపల్లి, జూన్ 28: భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీవీ స్వగ్రామం వంగరలో 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి ఆయన పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ ఇంటి ఆవరణలో నిర్వహించిన జయంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీవీ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు నడిపించారని గుర్తుచేశారు. భూసంస్కరణలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. పీవీ బహుభాషా కోవిదుడని, ఆయనకు 14 భాషలు తెలుసని అందరూ అనుకుంటారని, 15వ భాష కూడా తెలుసునని, అదే మౌనభాష అని చమత్కరించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో పీవీ సలహాలు తీసుకునేవారని తెలిపారు. పార్లమెంట్‌లో తాము లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేది కాదన్నారు. సోనియాగాంధీ, మీరాకుమారి, సుష్మా స్వరాజ్ వంటివాళ్లతో కలిసికట్టుగా ఉండి రాష్ట్రాన్ని సాధించుకున్నామని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పీవీ స్వగ్రామం వంగర ఉండడం తన అదృష్టమన్నారు. ఆయనను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, విశ్రాంత ఆచార్యులు వెంకటనారాయణ, కర్ణకంటి మంజులారెడ్డి, వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా, ఎంపీటీసీ నల్ల కౌసల్య, పీవీ మదన్‌మోహన్‌రావు, ఆలూరి రజిత, ఆర్ వెంకటరెడ్డి, అదరి రవి, కే రాజు, ఎస్ మొండయ్య, కాజీపేట ఏసీపీ తిరుమల్, తహసీల్దార్ ప్రవీణ్, ఎస్సైలు ఎన్ వెంకటేశ్వర్లు, ఎన్ సాయిబాబు, రాజుకుమార్ పాల్గొన్నారు.

### కేంద్రం విభజన హామీలను నెరవేర్చాలి

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విభజన హామీలను తక్షణమే నెరవేర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. భీమదేవరపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన హామీలను అమలుచేసేలా పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం తమ ఎంపీలు సైతం సహకారం అందిస్తారని తెలిపారు. కేంద్రం నుంచి తమకు రావాల్సిన సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడి జాబితాలోని అంశాలను పరిష్కరించాలని మంత్రి కోరారు.

## రైతన్న బిజీబిజీ

- సీజన్ మొదలవడంతో దుకాణాల్లో సందడి
- విత్తనాలు, పరికరాల కొనుగోళ్లతో కిటకిట



సీజన్ మొదలవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగు కోసం అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు కొనుగోలుకు పట్టణాల బాట పట్టారు. జనగామలోని ఓ దుకాణం వద్ద రైతులు తమకు కావాల్సినవి తీసుకెళ్తూ బిజీబిజీగా కనిపించారు. - జనగామ ఫొటోగ్రాఫర్, జూన్ 28

# నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక



- టెక్స్‌టైల్ పార్కు పనుల పరిశీలన
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులు
- జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అభివృద్ధిపై సమీక్ష

వరంగల్, జూన్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన టెక్స్‌టైల్ పార్కు, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనులపై రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్షించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన మహిళా శక్తి క్యాంటీన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రారంభించనున్నారు. వరంగల్, హనుమకొండ బస్‌స్టేషన్ల కొత్త భవనాల నిర్మాణాలకు నిధుల కోసం ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధిపైనా చర్చించనున్నట్లు తెలిసింది.

### సీఎం పర్యటన ఇలా..

- మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్‌లో వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుంటారు.
- 1.30–1.50 గంటల వరకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పనులను పరిశీలిస్తారు.
- 1.50 గంటలకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నుంచి కారులో బయలుదేరుతారు.
- 2.10 గంటలకు వరంగల్‌లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్దకు చేరుకుంటారు.
- 2.10–2.30 వరకు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు.
- 2.30 గంటలకు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నుంచి కారులో బయలుదేరుతారు.
- 2.45 గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంటారు.
- 2.45–3గంటల వరకు కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు.
- 3గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు.
- 5.30 గంటలకు కలెక్టరేట్ నుంచి కారులో బయలుదేరుతారు.
- 5.40–6.10 గంటల వరకు హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్‌ను సందర్శిస్తారు.
- 6.10 గంటలకు మెడికవర్ హాస్పిటల్ నుంచి కారులో బయలుదేరుతారు.
- 6.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్తారు.

# ప్రజాపాలన పాట్లు

- అధికారుల తప్పిదాలతో ప్రజలకు నో గ్యారెంటీలు..
- తప్పుల తడకగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ
- మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న నగరవాసులు

వరంగల్, జూన్ 28 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన పేరిట ఆరు గ్యారెంటీల దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించింది. ఆగమేఘాల మీద ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటిని వెంటనే ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో బల్దియా అధికారులు ఆదరబాదరగా చేయడంతో ప్రక్రియ తప్పుల తడకగా మారింది. లక్షల్లో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో అది కూడా ఒకటి, రెండు స్కీంలను మాత్రమే ఆన్‌లైన్ చేశారు. దీంతో ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న జీరో కరెంట్ బిల్లు, రూ. 500 గ్యాస్ సబ్సిడీ పథకాలు వేల మందికి రావడం లేదు. ప్రభుత్వం దరఖాస్తులో సవరణలకు అవకాశం ఇవ్వడంతో అధికారుల తప్పిదాలు బయటపడుతున్నాయి. అప్పుడు జీరో కరెంట్, గ్యాస్ సబ్సిడీకి దరఖాస్తు చేయలేదని, అందుకే రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. మళ్లీ కొత్త దరఖాస్తులు పెట్టుకోవాలంటున్నారు. దీంతో సవరణల కేంద్రాల వద్ద ప్రజలు సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. ఎలాంటి అర్హత లేని వారికి ఒక్కో దరఖాస్తుకు రూ.10 చెల్లించి రెండు రోజుల్లో బల్దియా అధికారులు 66 డివిజన్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అన్‌లైన్ చేయించారు. ల్యాప్‌టాప్‌లు లేకపోతే మొబైళ్లలో సైతం చేయించారు. ప్రజాపాలన దరఖాస్తుల అన్‌లైన్ నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారి చాలా మందికి గ్యారెంటీలు వర్తించడం లేదు. దీనిపై అడిగితే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదంతో 200 యూనిట్ల కంటే తక్కువ కరెంట్ వినియోగించుకున్నా జీరో బిల్లు రావడం లేదని వాపోతున్నారు. సవరణల కోసం వస్తే అధికారుల తప్పిదాలు బయట పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బల్దియా కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ కోసం బారులు తీరిన జనం



హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బోయినపల్లి వినోద్‌కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

# భూ సంస్కరణలు తెచ్చింది పీవీ

- ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలి
- ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

హనుమకొండ, జూన్ 28 : భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావుదని ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పీవీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ బస్‌స్టేషన్ సమీపంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ కెప్టెన్ లక్ష్మీకాంతారావు సొంతంగా హనుమకొండలో పీవీ విగ్రహం ఏర్పాటు చేయగా హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ మార్గ్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పెద్ద విగ్రహం ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి గొప్ప పునాది వేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు భూ సంస్కరణల చట్టం తీసుకువచ్చారన్నారు. ఆ సమయంలో ఆ చట్టం అమలు చేయడం హర్షణీయమన్నారు. అయితే ఆదే సమయంలో కాంగ్రెస్ నాయకులంతా కలిసి ఆయనను సీఎం పదవి నుంచి తప్పించారన్నారు. బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్నపుడు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సర్వేల్‌లో, రాయలసీమ, కోనసీమల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు మొట్టమొదట ఏర్పాటు చేసిన ఘనత పీవీదేనన్నారు. ఆ తర్వాత రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత గ్రామీణ ప్రాంతంలోని పిల్లలకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేసిన మహనీయుడు పీవీ నర్సింహారావు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటికీ అన్ని జిల్లాలో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొట్లాడి ప్రతి జిల్లాకు నవోదయ పాఠశాలను ఏర్పాటు చేస్తేనే తెలంగాణ ప్రాంత బిడ్డ అయిన పీవీ నర్సింహారావుకు నిజమైన నివాళులర్పించిన వారమవుతామని వినోద్‌కుమార్ పేర్కొన్నారు.



ధాన్యం బస్తాలు లేకుండా ఖాళీగా ఉన్న మణికంఠ రైస్‌మిల్లు గోదాము

- కేసముద్రంలోని 3 రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు
- మిల్లుల యజమానులపై కేసు నమోదు

# రూ.30 కోట్ల ధాన్యం మాయం

కేసముద్రం, జూన్ 28 : కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.30కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. సివిల్ సప్లయ్ డీఎం కృష్ణవేణి కథనం ప్రకారం.. మణికంఠ రైస్ మిల్లులో 12,360 క్వింటాళ్లు, వీటి విలువ సుమారు రూ. 3కోట్ల79 లక్షలు, మారుతి రైస్ మిల్లులో 43,464 క్వింటాళ్ల ధాన్యం, వీటి విలువ సుమారు రూ.13కోట్ల 80 లక్షలు, మహదేవ రైస్ మిల్లులో 58,070 క్వింటాళ్ల ధాన్యం, వీటి విలువ సుమారు రూ.12కోట్ల79 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మూడు మిల్లుల్లో కలిపి సుమారు రూ.30కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తెలిపారు. ప్రభుత్వానికి బియ్యం అందించకపోవడం, మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడంతో యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. కేసముద్రంలో మరికొన్ని మిల్లుల్లో సీఎంఆర్ ద్వారా ప్రభుత్వానికి బియ్యం అందించాల్సి ఉందని అధికారులు తెలిపారు. కాగా, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరించింది. ఈ ధాన్యాన్ని అధికారులు కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలిస్తారు. మిల్లుల్లో మర ఆడించి వచ్చిన బియ్యాన్ని తిరిగి సివిల్ సప్లయ్ అధికారులకు (ప్రభుత్వానికి)అందించాలి. అయితే, కొంతమంది వ్యాపారులు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంలో కొంత మేర ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కేజీకి రూ.5 నుంచి రూ.8 వరకు తక్కువ ధరకు కొని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)విధానం ద్వారా తిరిగి సివిల్ సప్లయ్ గోదాములకు తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తూ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు అధికారులు రెండు రోజుల నుంచి కేసముద్రం మిల్లుల్లో తనిఖీలు చేపడుతున్నారు.



వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో నకిలీ విత్తనాలు విక్రయించారంటూ విత్తన దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

# నకిలీ విత్తనాల కలకలం

- విత్తన దుకాణం ఎదుట రైతుల ఆందోళన
- పరిశీలించిన మాజీ మంత్రి దయాకర్‌రావు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫోన్

వర్ధన్నపేట, జూన్ 28 : వర్ధన్నపేటలో నకిలీ వరి విత్తనాలు కలకలం సృష్టించాయి. నకిలీని అరికట్టేందుకు అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా మార్కెట్‌లో వాటి క్రయవిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. వర్ధన్నపేటలోని ఓ ఎరువుల దుకాణంలో రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన రైతులు మహేశ్, నాగరాజు వారం రోజుల క్రితం విత్తనాల బస్తాలను కొనుగోలు చేసి మండెకట్టారు. మూడు రోజులైనా మండె రాకపోవడంతో రైతులు వాటిని అదే బస్తాలో నింపి శుక్రవారం దుకాణం వద్దకు తీసుకొచ్చి నిలదీశారు. వ్యాపారి సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంతో రైతులు, స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు. తాము బస్తాకు రూ.950 చెల్లించి కొన్న విత్తనాలు మొలకెత్తకపోవడంతో నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్న విషయమై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రాయపర్తికి వెళ్తున్న క్రమంలో వర్ధన్నపేటలో రైతుల ఆందోళన గురించి తెలుసుకొని వారితో మాట్లాడారు. మొలకెత్తని ధాన్యాన్ని పరిశీలించి వెంటనే వరంగల్ కలెక్టర్, స్థానిక వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ చేశారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దయాకర్‌రావు కోరారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించడం సరికాదన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రైతుల పక్షాన బీఆర్‌ఎస్ కొట్లాడుతుందని ఎర్రబెల్లి స్పష్టంచేశారు.

# కొత్త డిజైన్‌తో గోదావరి కరకట్ట

- జియో ట్యూబ్స్ తరహాలో నిర్మాణం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- రామన్నగూడెం నుంచి మంగపేట వరకు గోదావరి తీరం పరిశీలన

ఏటూరునాగారం, జూన్ 28 : గోదావరి కరకట్టను కొత్త డిజైన్‌తో నిర్మించనున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం సమీపంలో దెబ్బతిన్న గోదావరి కరకట్టను శుక్రవారం మంత్రి పరిశీలించి, కట్ట తెగకుండా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలను నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరికి వరద బాగా వచ్చినపుడు రక్షణగా ఉండేలా కరకట్టకు కొత్త డిజైన్‌ను ఆమోదించామని, జియో ట్యూబ్స్ మోడల్‌లో నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. గతంలో వచ్చిన గోదావరి, జంపన్నవాగు వరదలను దృష్టిలో పెట్టుకుని అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. కరకట్ట షట్టర్లను కూడా మరమ్మతు చేస్తామన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. రామన్నగూడెం, రాంనగర్ మీదుగా కమలాపురం వరకు గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలిస్తూ మంగపేట మండలానికి వెళ్లారు.

### మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలి

ఏటూరునాగారంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని, ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని మంత్రి సీతక్క సూచించారు. కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో కలిసి ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సీతక్క పాఠశాలలో భోజన, వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రామాలయం సెంటర్‌లో ఉన్న పల్లె దవాఖానను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



గోదావరి కరకట్టను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్

గోదావరి వరద ముంపు నుంచి గ్రామాలను కాపాడేందుకు జియో ట్యూబ్స్ తరహాలో కరకట్ట నిర్మించనున్న నేపథ్యంలో నీటి పారుదలశాఖ అధికారులు ఐటీడీఏ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించగా మంత్రి సీతక్క హాజరయ్యారు. రామన్నగూడెం నుంచి మంగపేట మండల కేంద్రం వరకు సుమారు 7.5 కిలోమీటర్ల పొడవున కొత్త డిజైన్‌ను ఎక్కడెక్కడ నిర్మించాల్సి ఉంటుందో చర్చించారు.

### రైతును రాజు చేయడమే లక్ష్యం

మంగపేట : రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. మంగపేట మండల కేంద్రంలో రూ. 1.28 కోట్లతో నిర్మించిన సహకార వ్యవసాయ సంఘం నూతన భవనాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి మంచి పనైనా ముహూర్తం లేకుండా ప్రారంభిస్తానన్నారు. త్వరలోనే మండల కేంద్రంలో కస్తూర్బా హాస్టల్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం కమలాపురంలోని బిల్ట్ కర్మాగారాన్ని సందర్శించారు. వీలైనంత త్వరలో ఫ్యాక్టరీని ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్పీ మహేశ్ గీతే, నీటి పారుదల శాఖ సీఈ అజయ్ కుమార్, ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ జగదీశ్వర్, ఏపీవో వసంతరావు, డీడీ పోచం, గిరిజన సంక్షేమశాఖ ఈఈ వీరభద్రం, ఏటీడీవో దేశీరాం, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, నాయకులు జయరాం రెడ్డి, వల్లపల్లి శివయ్య తదితరులు పాల్గొన్నారు.